
కథ

# అరుణో'రుణం'

కె. ప్రవీణరెడ్డి



ఒక పచ్చని లోయ. ఉన్నట్టుండి ఆ లోయలో మంటలు లేచాయి. ఉవ్వెత్తున ఎగిసిపడుతూ ఆకాశాన్నంటుకోవడానికి అగ్రులు చాస్తున్నాయి. ఎవరో కొండ చరియల మీంచి జారి ఆ మంటల్లోకి పడి పోతున్నారు. అయ్యో! అతను దేవ్ కదూ! అవును దేవ్. అయ్యో మంటల్లో... అయ్యో క్షణాల్లో వేయినాలుకలతో ఆ మంటలు అతన్ని చుట్టుముట్టాయి. అంతే దేవ్. అరిచిందామె. గొంతు నొక్కుకు పోయినట్లుగా అయ్యింది. ఆరుపు ఆమె కంఠంలోంచి బయటకి రావడం లేదు. నాలిక పొడారి పోతూంది. ఉలిక్కిపడి లేచింది.

మంచం పక్కనే ఉన్న జగ్గు ఎత్తి నీళ్లని గటగటా తాగింది. దడదడలాడుతున్న గుండె కాస్త కుదుట పడింది. అబ్బ! పీడకల. ఎంత భయంకరమైన కల అది అనుకుంది. కిటికీలోంచి లేత వెలుగు గదిలో పడుతూంది. తెల్లవారుతూంది. ఈ సమయంలో వచ్చే కలలు నిజమవుతాయంటారు. అయితే దేవ్ కేదన్నా ప్రమాదం జరుగుతుందా? ఛీ... ఛీ.. అవన్నీ ఒట్టి మాటలు అట్లాంటిదేం జరగదు. తల విదిలించుకుంటూ లేచి బాత్‌రూంలోకి వెళ్లింది. కాసేపటికి కాఫీ తాగుతూ, న్యూస్ పేపర్ చేతిలోకి తీసుకుంది. అక్షరాలకు బదులుగా కలలోని దృశ్యమే కళ్ల ముందు కదులుతూంది. ఆమె మన సెందుకో కీడు శంకించింది. పేపర్ పక్కన పెట్టి ఫోన్ చేతిలోకి తీసుకుంది. ట్రావెల్ ఏజెంట్‌కి ఫోన్ కలిపింది. రాంచీకి ఓ ఫ్లయిట్ టిక్కెట్ బుక్ చేయ మని చెపుతూంటే అక్కడే పేపర్ చదువుతూన్న వీరేంద్ర అన్నాడు. ''రాంచీ..!'' అన్నాడు ఆశ్చ ర్యంగా.

అవున్నన్నట్లుగా తలూపింది.

''నేనూ వస్తాను మరో టిక్కెట్టు చెప్పు'' అన్నాడ తను.

ఆమె రెండో టిక్కెట్ కూడా చెప్పి ఫోన్ పెట్టే సింది.

***

రాంచీ చేరాక అక్కడ్నించి కార్లో దామోదర్ వ్యాలీకి బయలుదేరారు. రాత్రంతా ప్రయాణం చేశారు. తూర్పు తెలతెలవారుతుండగా గమ్యానికి చేరువలో వున్నారు. కొండల్ని తొలిచి వేసిన తారు రోడ్డుపై మలుపులు బాగా వుండడంతో కారు లోయలోకి నెమ్మదిగా దిగుతోంది. ఆమె కారు అద్దం దింపి కిటికీలోంచి కిందకి చూసింది. లోయలో దట్టంగా పెరిగిన మోదుగ చెట్లు విరగ బూసి వున్నాయి. ఆమెకా క్షణంలో ఆ పూలు నిప్పు కణికల్లా తోచాయి.

పోయినసారి తానిక్కడికి వచ్చినప్పుడూ ఇలాగే పూసి వున్నాయి. పగడాల వాన కురిసినట్లుగా '' అబ్బా ఎంత బాగున్నాయో కదూ'' అన్నది వీరేంద్రతో.

''వాసన లేని అడవి పూలు'' అన్నాడతను నిప్పుల మీద నీళ్లు జల్లినట్లుగా.

చివుక్కుమన్నది ఆమె మనసు. నిజమే అవి వాసనలేని పూలే. అయితేనేం? పగడపు జిలుగు లద్దుకున్నట్లుగా కాంతులీనుతున్నాయి. పట్టుకు చ్చుల్లా మెరిసిపోతున్నాయి అనుకుంది అప్పుడు. కానీ ఈ రోజెందుకో అవి మండుతున్న కొరువుల్లా భయపెడుతున్నాయి. ఆమెకు మళ్లీ దేవ్ తలుపుకు వచ్చాడు. ''....దేవ్...'' అనుకుంది ఆమె మనసు ఆరాటంగా.

పోయినసారి తాము రాంచీ వచ్చినప్పుడు జరి గిన సంఘటన గుర్తుకు రావడంతో వీరేంద్ర ఒళ్లు జలదరించింది. అసంకల్పితంగా ఆమె చెయ్యిని తన చేతిలోకి తీసుకున్నాడు. ఉన్నట్టుండి ఆమె ఇక్కడికెందుకు ప్రయాణమయ్యిందో అర్థం కాలేద తనికి. కారు మలుపులు తిరుగుతూ ముందుకు వెళుతోంది. వీరేంద్ర మనసు పాత జ్ఞాపకాలలోకి వెళ్లింది.

శ్రీనిధి. ఆమె అందం అపురూపం. ఆమెను పెళ్లాడాలని ఎందరో అబ్బాయిలు కలలుగన్నారు. కుర్రాళ్లెందరో ఆమె దృష్టిలో పడాలనే తపనతో శ్రీనిధి కాలేజీకి వచ్చే సమయానికి గేటు ఎదురుగా పడిగాపులు పడేవాళ్లు. గుర్రపు స్వారీ ఆమె హాబీ. ఎంతో మంది అబ్బాయిలు రైడింగ్ క్లబ్‌లో మెంబర్ షిప్ కోసం క్యూ కట్టేవాళ్లు. ఆ శ్రీనిధి వీరేంద్ర సొంతమయింది. వాళ్ల నాన్నగారు కోరుకున్న అల్లుడి లక్షణాలు అతనిలో పుష్కలంగా వున్నాయి. డబ్బూ, హోదా, చదువు, అందం, తెలివితేటలూ, చలాకీతనం అన్నీ కలగలిపినట్లున్న వీరేంద్రతో శ్రీనిధి పెళ్లి జరిగింది. ఆ జంటను చూసినవా ళ్లందరూ ''మేడ్ ఫర్ ఈచ్ అదర్'' అనుకున్నారు. వీరేంద్ర భార్యకి ఖరీదైన దుస్తులూ, నగలు కానుకగా ఇచ్చాడు. అందంగా ముస్తాబవ్వా లంటాడు. విందులకూ, వినోదాలకు తీసికెళ్తాడు. ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని విలాస వంతమైన పార్టీలు ఏర్పాటు చేస్తాడు. వీరేంద్ర తన సంపదను భార్య కట్టుకునే దుస్తులలో ప్రదర్శి స్తాడు. ఎందరో శ్రీనిధిని రోల్ మోడల్‌గా భావించి ఆమె నడవడికనూ అలంకరణనూ అనుకరించే వారు. వీరేంద్ర పక్కన కుందనపు బొమ్మలాంటి శ్రీనిధిని చూసినప్పుడు చాలా మంది కళ్లల్లో స్పష్టంగా కనపడే అసూయ అతనికి గమ్మత్తయిన నిషానిచ్చేది.

రాను రానూ వీరేంద్ర బిజినెస్ వ్యవహారాలతో బిజీ అయ్యాడు. శ్రీనిధి పై చదువులకు వెళ్లడం, ఉద్యోగం చేయడం వీరేంద్రకు ఇష్టం లేకపోవ డంతో ఆమె ఇంట్లోనే ఉండి పోయింది. ఆరోజు వీరేంద్ర 'రాంచీ' వెళ్లడానికి సిద్ధమవు తున్నాడు.

'' ఈ రోజు వెళ్లకపోతే నేం?'' అన్నది శ్రీనిధి.

''వెళ్లాలి. యురేనియం గనుల తవ్వకం పనుల టెండర్ వేయడానికి వర్క వుట్ చేసుకోవాలి. ఆఖరు తేదీ దగ్గర పడింది.'' అన్నా డతను.

ఇద్దరి మధ్యా కాసేపు మౌనం.

''రేపు మన పెళ్లిరోజు'' చెప్పిందామె.

వీరేంద్ర రిస్ట్‌వాచ్‌లో తేదీ చూసుకున్నాడు. ''అ వును కదూ. మర్చేపో యాను. అంటూ బ్రీఫ్‌కేస్ తెరిచి చెక్‌బుక్ తీశాడు. చెక్ మీద సంతకం చేసిస్తూ నీకు నచ్చిందేదైనా కొనుక్కో''అ న్నాడు.

శ్రీనిధి చెక్ తీసుకోలేదు. మౌనంగా అతని వైపు చూస్తుండిపోయింది. ఆమె చూపుల్లోని భావమేమిటో అర్థం కాలేదతనికి.

పది లక్షలకు రాసాను. సాలిటేబుల్ డైమండ్ సెట్టు కొనుక్కోంటావా. ఇంకా కావాలా? అన్నాడు మరో చెక్ తీస్తూ.

ఆమె అడ్డంగా తలవూపి అనాసక్తిగా చెక్ తీసు కొని పక్కన పెడుతూ ''నేను...నేనూ మీతో వస్తా ను'' అడిగింది.

''నాతో వచ్చి ఏం చేస్తావ్. నేను వెళ్లేది లోయ ప్రాంతం. అక్కడేమీ వుండదు. అంతా అడవి. రాళ్లూ రప్పలూ....''


''ఫర్వాలేదు మీతో వుంటాను''


''నీ ఇష్టం''

***

ఫ్లయిట్‌లో రాంచీ వెళ్లారు. అక్కడ్నించి కార్లో దామోదర్ వ్యాలీకి బయల్దేరారు. కారు కొండవైపు గెస్ట్ హౌస్‌కి వెళుతోంటే కారు కిటికీలోంచి లోయ లోకి చూస్తుండిపోయింది నిధి. వీరేంద్ర ప్రయా ణంలో కూడా సమయం వృథా కాకుండా ఏవో కాగితాలు చూసుకుంటున్నాడు. వసంత ఋతువు అవడంతో లోయలో ఒత్తుగా పెరిగిన మోదుగ చెట్లు విరగబూసి వున్నాయి.

అరుణకిరణాల తాకిడికి పగడాల్లా ప్రకాశిస్తున్న ఆ పూలను చూసి ''అబ్బా ఎంత బావున్నాయి. పగ డాల వాన కురిసినట్లుగా'' అన్నది వీరేంద్రతో. ఏకా గ్రతతో కాగితాలు చూస్తున్న వీరేంద్ర ఆ మాటలు వినిపించుకోలేదు. శ్రీనిధి ఈ సారి కాస్త గట్టిగా అన్నది అవే మాటలను.






అతను దృష్టి కూడా మరల్చకుండా ''వాసన లేని అడవి పూలు'' అన్నాడు కాస్త చిరాగ్గా. అతని మాటలకు చిన్నబుచ్చుకున్న శ్రీనిధి మౌనంగా కూర్చుండిపోయింది. కాసేపటికి కొండమీది గెస్ట్‌హౌస్‌కి చేరుకున్నారు. ఎత్తయిన ఆ కొండ మీంచి దృశ్యం అద్భుతంగా కనిపిస్తూంది. కొండ అంచు వరకూ వెళ్లి కళ్లు విప్పార్చుకొని మరీ చూస్తుండిపోయింది శ్రీనిధి.

వీరేంద్ర రెడీ అయ్యి బయటకు వెళుతూ 'నిధీ! భోంచేసి కాసేపు రెస్ట్ తీసుకో. నేను నాలుగింటికల్లా వస్తాను. సాయంకాలం హార్స్ రైడింగ్‌కి వెళదాం. అందుకు కావలసిన ఏర్పాట్లు చేయమని మేనేజర్‌కి చెప్పాను'' అన్నాడు.

వీరేంద్ర నాలుగింటికల్లా రాలేకపోయాడు. తిరిగి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. శ్రీనిధి కనిపించలేదు. ఆమె కోసం పిచ్చివాడిలా వెతికాడు. ఆ రోజు జరిగింది తలచుకుంటున్న వీరేంద్ర చెయ్యి అసంకల్పితంగా ఆమె చేతిపై బిగుసుకుంది. ఆమె అతని వైపు చూసింది. ఆరోజు ఆరోజు ఆమె కళ్ల ముందు ఆ దృశ్యం గిర్రున తిరిగింది.

ఆరోజు సాయంత్రం వీరేంద్ర కోసం ఎదురు చూస్తోంది. ఐదవుతోంది. వీరేంద్ర ఇంకా రాలేదు. అసహనంగా గెస్ట్ హౌస్ బయటకు వచ్చింది. అక్కడ రెండు గుర్రాలు స్వారీకి సిద్ధంగా వున్నాయి. తను కూడా టైట్స్ తొడుక్కుని, రైడింగ్ బూట్స్ వేసుకొని రెడీ అయ్యింది. అరగంట గడిచింది. వీరేంద్ర ఇంకా రాలేదు. శ్రీనిధి కొండ అంచు వరకూ వెళ్లింది. సూర్యాస్తమయం అవుతోంది. అరుణకాంతులలో మోదుగపూలు మరింతగా తళుకులీనుతున్నాయి. సూర్యుడు కొండ వెనుకకు జారుకుంటున్నాడు. ఇంకా వీరేంద్ర రాలేదు. నిధి మొహం క్రోధపు ఛాయలతో ఎర్రబారి కొండ వెనకాల జారుకున్న సూర్యుడిటు వచ్చాడేమో అన్నట్లుగా వుంది. నిధికి ఉక్రోషం ముంచుకొచ్చింది. కళ్లల్లో నీళ్లు నిండాయి. ఎప్పుడూ ఇంతే. ఇలాగే జరుగుతోంది. జుట్టుకు బిగించి కట్టుకున్న రబ్బర్ బాండ్ విప్పి విసిరేస్తూ అనుకుంది. విందులకూ వినోదాలకూ వెళ్లాలనుకుంటే మాత్రం అరగంట ముందుగానే వస్తాడు. షోకేసులో బొమ్మలా తయారైన తనను ఓ ప్రదర్శించే వస్తువులాగా తీసికెళతాడు. ఆమె కళ్లల్లో నీళ్లు వరదలై పొంగాయి. ఈరోజు తమ పెళ్లిరోజు. కనీసం అదైనా గుర్తు లేదు... ఛీ... ఏం మనిషి?

లోపల వంటమనిషి చేస్తున్న పదార్థాల తాలుకు ఘుమఘుమలు ముక్కుపుటాలను సోకాయి. ఆమె కోపం నసాళానికి అంటింది. ఎన్ని కలలు కన్నది తాను. ఓ పక్క చీకటి పడుతోంది. దారి వైపు దృష్టి సారించింది. కనుచూపు మేరలో వీరేంద్ర లేడు. అతనిప్పట్లో రాడు. ఆమె తల విదిలించుకుంటూ గుర్రంపైకి ఎక్కింది. గుర్రం ముందుకు వెళుతోంది.

''మేమ్ సాబ్ చీకటి పడుతోంది. ఒక్కరూ వెళతారా?'' పరిగెత్తుకుంటూ వచ్చాడు గుర్రాలు తెచ్చిన మనిషి.

''ఫర్వాలేదు. నా కలవాటే'' అంటూ గుర్రాన్ని అదిలించింది. గుర్రం వేగంతో పాటు ఆమె ఆలోచనల వేగమూ పెరిగింది.

అసలు వీరేంద్ర ఏనాడైనా తన ఇష్టాయిష్టాలను తెలుసుకొని ప్రవర్తించాడా? ఊహూ... తనకు హనీమూన్ మాల్దీవులకు వెళ్లాలని వుంటే ఆయన పారిస్ తీసుకెళ్లాడు. తనకు నచ్చిన దుస్తులు కాకుండా ఆయనకు నచ్చినవి వేసుకోవాలి. ఎప్పుడైనా నలతగా వుండి పార్టీకి రాలేనన్నా వినిపించుకోడు. అక్కడికెళ్తే ఉత్సాహం అదే వస్తుంది అని లాక్కెళతాడు. ఎప్పుడూ తనవైపు నుంచే ఆలోచిస్తాడు. ఎదుటి వాళ్లకూ మనసుంటుందని వాళ్లకూ సొంత ఆలోచనలుంటాయని ఏనాడైనా ఆలోచించాడా? ఊహూ... ఆమె అసంకల్పితంగా లోయవైపు చూసింది. మసక చీకట్లో కూడా మోదుగపూలు ముచ్చట గొలుపుతున్నాయి. అడవిపూలు..వాసన లేని పూలు వీరేంద్ర మాటలు చెవుల్లో తిరిగాయి.

అయితేనేం ఎంతందంగా వున్నాయి. ఆమె గుర్రాన్ని ఆపింది. కిందకి దిగి కొండ అంచుకు వచ్చింది. అక్కడ్నించి కాస్త వంగితే చెట్టు కొమ్మ తగిలేలా వుంది. ఇంకాస్త వంగింది. మోదుగపూల కొమ్మ చేతికి అందింది. ఆమె ఏకాగ్రత అంతా కొమ్మ విరియడంలోనే వుంది. కాళ్ల కింద కొండ చరియ మట్టి సడలడం గమనించలేదు. ఏం జరిగిందో అర్థం చేసుకునే లోపే కాలుజారింది. లోయలోకి పడిపోతుంటే భయంతో కళ్లు మూసుకుంది. ఆమె అరుపు లోయంతా ప్రతిధ్వనించింది.

***

ఆమె కళ్లు తెరిచేసరికి ఎదురుగా ఓ యువకుడూ, ముసలావిడా వున్నారు. విచిత్ర వేషధారణలో వున్న వాళ్లను చూసి కెవ్వుమని అరుస్తూ పైకి లేవబోయింది. కానీ ఆమె వశం కాలేదు. మెడ దగ్గర నొప్పి రావడంతో తల లేవలేదు. కాళ్లూ చేతులూ ఏవీ తన స్వాధీనంలో లేవు. ఒళ్లంతా భరించలేనంత నొప్పి. అసలేం జరిగింది. గుర్రం, మోదుగపూలు, తను పడిపోవడం అన్నీ గుర్తుకు

వచ్చాయి. అయితే వీళ్లెవరున? ఎక్కడో లోయలో పడిపోయిన తను వీళ్లకు దొరికిందా? ఎవరో కొండ మనుషుల్లా వున్నారు. ఆ ముసలవ్వా, యువ కుడూ ఆమె వైపే చూస్తున్నారు. ఆమె కళ్లు తెరవ డాన్ని చూసిన వాళ్ల కళ్లల్లో సంతోషం కనిపిస్తోంది. వాళ్లేదో తమ భాషలో మాట్లాడుకున్నారు. శ్రీనిధికి ఒక్క ముక్కా అర్థం కాలేదు.వెదురు గొట్టంలో జావ లాంటిదేదో తెచ్చి ఆమెచేత తాగించారు. అది చప్పగా వుండడంతో మొహం పక్కకు తిప్పు కుంది. వాళ్లు గోల గోలగా ఏదో అంటున్నారు. అది తాగే వరకూ వాళ్లు వినరని అర్థమయ్యి మొత్తం తాగేసింది. జరిగిందేమిటో శ్రీనిధి మననం చేసు కుంది. వీరేంద్ర మీది కోపంతో బయలుదేరిన తను లోయలో పడింది. స్పృహ తప్పిన స్థితిలో వీళ్లకు దొరికి వుంటుంది. ఒళ్లంతా గాయాలు తగిలాయి. అక్కడ తనకోసం వీరేంద్ర ఎంత వెతుక్కుంటు న్నాడో తనెక్కడుందీ తెలియదు. ఇక్కడి కొచ్చి ఎన్ని గంటలైందో... గంటలేనా రోజులా ఏదీ తెలియడం లేదు.

వాళ్ల భాష తనకు తెలియదు. తాను చెప్పేది వాళ్లు అర్థం చేసుకోలేరు. భగవంతుడా? నాకేది దారి? తన ఆవేశం ఇలాంటి దుస్థితికి దారితీ సింది.... దేవుడా! నన్ను త్వరగా వీరేంద్ర దగ్గరకు చేర్చు తండ్రీ. రెండు చేతులూ జోడించబోయింది. చేతులు కట్టిపడేసినట్లుగా వుండి పైకి లేవ లేదు. ఆమె గబుక్కున లేవబోయింది. నడుం లేవలేదు. ఆమెకు భయం వేసింది. వీళ్లు తనని బంధించలేదు కదా! అనుకుంది.


ఆమె కదిలే ప్రయత్నం చేస్తూందని గమ నించిన వాళ్లు ఏదో చెపుతున్నారు. ఆమెకేం అర్థం కాలేదు. కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి. వాళ్లామె వైపు జాలిగా చూసి సైగలతో నెమ్మదిగా ఏదో చెప్పారు. తాను కదలకుండా పడుకోవాలని అర్థం చేసు కుంది. బాగా గాయాలై వుంటాయి. అనుకుంటూ కళ్లు కిందకి వాల్చి తన వంక చూసుకుంది. గొంతు వరకూ కంబళి లాంటిదేదో కప్పి వుంది. గుడిసె ముందు మూడు రాళ్ల పొయ్యి వుంది. దాని పై మట్టి పాత్రలో ఏదో మరుగుతున్నట్లుగా పొగలు వస్తున్నాయి. ఆమెకు తన భవంతి. నౌకర్లు, కార్లు అన్నీ కళ్ల ముందు గిర్రున తిరిగాయి. తన భర్త ఎలా వున్నాడో. దేవుడా! నన్ను వీరేంద్ర దగ్గరకి చేర్చు. మళ్లీ అనుకుంది. అంత బాధలోనూ ఆమె కళ్ల మీదికి నిద్ర ముంచుకు వచ్చింది. మత్తు ఆవ హించినట్లుగా... ఎంత సేపు పడుకుందో మెలకువ వచ్చేసరికి కళ్లెదురుగా ఆ యువకుడు కని పించాడు. ఆమె కళ్లు తెరవడం చూసి దగ్గరకు వచ్చాడు. మట్టిపాత్రలో నీళ్లు తెచ్చి తాగించాడు... తడారిపోయినట్లుగా వున్న నోరు తెరుకుంది... వీరేంద్రా త్వరగా వచ్చేయ్. కళ్లు మూసుకుపో తుండగా అనుకుంది మళ్లీ.

***

శ్రీనిధి స్పృహలోకి వచ్చాక రెండు రాత్రులు గడిచాయి. ఒక్కొక్క రోజు గడుస్తున్న కొద్దీ ఆ పరి సరాలకు అలవాటు పడుతోంది. నెమ్మదిగా అక్కడి జీవన శైలి ఆకళింపు చేసుకుంటోంది. లోతట్టు ప్రాంతంలో కొంత స్థలం చదును చేసుకొని కొన్ని గిరిజన కుటుంబాలు అక్కడ నివాసం ఏర్పర్చుకు న్నాయి. అక్కడంతా ఓ పది గుడిసెలుంటా యేమో! పగలంతా పనులకు వెళతారు. చీకటి పడుతుండగా తిరిగి వస్తారు. శ్రీనిధిని కనిపెట్టు కొని వీళ్లద్దర్లో ఎవరో ఒకరుంటారు. ఆ యువకుణ్ణి 'దేవ్' అని పిలుస్తారు. ఆ ముసలవ్వను నదియా అంటారు. వాళ్లు మాట్లాడే భాషలు కొన్ని హిందీ పదాలు మిళతమై వుండడం వల్ల ఆమె కొద్ది కొద్దిగా అర్థం చేసుకోగలుగుతోంది. వాళ్లిద్దరూ ఏవేవో ఆకు పసర్లు కలిపిన జిగురు పదార్థాన్ని రోజూ తన ఒంటికి పూస్తారు. కాసేపట్లో ఒళ్లంతా బిగుసుకున్న ట్లుగా అయిపోయేది. శరీరం కట్టెలా మారినట్లు అనిపించేది. మొదట్లో ఆ జిగురు పదార్థాన్ని దేవ్ తన ఒళ్లంతా రుద్దుతుంటే సిగ్గుతో చచ్చిపోతు న్నట్లు అనిపించేది. అతని ముఖంలో మాత్రం ఎలాంటి భావం కనిపించేది కాదు. మౌనంగా తన పని తాను చేసుకుపోయేవాడు. రోజులు గడుస్తున్న కొద్దీ గాయాలు మానుతున్నాయి. నొప్పి బాగా తగ్గింది మెల్ల మెల్లగా ఒక్కొక్క కట్టూ విప్పారు. మరో రెండు వారాలుగడిచాయి. కట్లన్నీ విప్పారు. కాలి మడమ దగ్గర మాత్రం ఇంకా నొప్పిగానే వుంది. నాయనమ్మా, మనుమడూ ఆమెని కంటికి పాపలా చూసుకుంటున్నారు. తడిగుడ్డతో ఒళ్లంతా శుభ్రంగా తుడిచి దుస్తులు మార్చేవారు. నాలు గైదు రోజులకొకసారి అన్నం వార్చిన గంజిలో ఏవో కాండాల్లాంటివి వేసి మరగబెట్టి తలంటేవారు. అక్కడి స్త్రీలుకట్టుకునే లెహెంగా చోళీ తనకూ వేసే వారు. దాదాపు నెల గడిచింది. ఆమె పూర్తిగా కోలు కుంది. కాస్త కదిలితే నొప్పితో విలవిల్లాడేది. అలాంటిది ఇప్పుడు ఆమె నడవగలుగుతోంది. అప్పట్లో రాత్రి పగలూ మత్తుగా నిద్ర పట్టేది. ఇప్పుడంతగా నిద్ర కూడా రావడం లేదు.రోజంతా ఏం చేయాలో తోచడం లేదు. ఆ సాయంకాలం ఆకాశం మబ్బు పట్టి ఆహ్లాదంగా వుంది. దగ్గర్లోని వాగు మీంచి చల్లగాలి శరీరాన్ని సోకి హాయి గొలు పుతోంది. ఆమె నెమ్మదిగా నడుస్తూ వాగు దగ్గరకి వచ్చింది. నీళ్లల్లో తన ప్రతిబింబం కనపడింది. ఎన్నాళ్లయింది తనని తాను చూసుకొని. అరకొరగా వున్న దుస్తుల్లో ప్రాణం పోసుకున్న పాలరాతి ప్రతి మలా వుంది. కరి మబ్బులను తలపిస్తున్న కురుల మధ్య ముద్దులొలుకుతున్న ముఖం చంద్ర బింబంలా కాంతులీనుతూంది. దేవ్ తనని 'చాన్దీ' అని పిలుస్తాడు. అంటే అతని కళ్లకు తాను చంద్ర బింబంలా కనిపిస్తుందా? అనకుంటున్న శ్రీనిధికి పిల్లనగ్రోవి వినిపించింది. దేవ్ వస్తున్నాడు అను కుంది. పశువుల్ని మేతకు తీసుకెళ్లే దేవ్ ఇంటికి తిరిగి వస్తున్న సంకేతం అది. ఆమె వెనక్కి తిరిగి చూసింది. తలపైన కట్టెలమోపు భుజాలకు వేసు కొన్న జోలెల్లాంటి వాటిల్లో పళ్లు, కాయలు, ఓ చేత్తో పిల్లనగ్రోవి పట్టుకొని పశువుల మందతో వస్తు న్నాడు. ఆ పిల్లన గ్రోవి వింటూనే నదియా జావ లాంటిదేదో సిద్ధం చేసింది. దేవ్ వస్తూనే కట్టెల మోపును గుడిసెవతల ఓ వారగా జారవిడిచి భుజానికి తగిలించుకున్న జోలెలు పక్కన



మొదట్లో ఆ జిగురు పదార్థాన్ని దేవ్ తన ఒళ్లంతా రుద్దుతుంటే సిగ్గుతో చచ్చి పోతున్నట్లు అనిపించేది. అతని ముఖంలో మాత్రం ఎలాంటి భావం కనిపించేది కాదు. మౌనంగా తన పని తాను చేసుకుపోయేవాడు. రోజులు గడుస్తున్న కొద్దీ గాయాలు మానుతున్నాయి. నొప్పి బాగా తగ్గింది మెల్ల మెల్లగా ఒక్కొక్క కట్టూ విప్పారు. మరో రెండు వారాలుగడిచాయి. కట్లన్నీ విప్పారు. కాలి మడమ దగ్గర మాత్రం ఇంకా నొప్పిగానే వుంది.



శ్రీనిధి కోసం ఇంకా గాలిస్తూనే వున్నాడు. ఆశ చావక అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాడు. తన బిజినెస్ వ్యవహారాలన్నీ పక్కన పెట్టి కొండపై గెస్ట్‌హౌస్‌లో వుంటున్నాడు. శ్రీనిధిని వెదికి అప్పగించిన వాళ్లకు భారీ బహుమతులు ప్రకటించాడు. ఆమె ఫోటోలను ఆ అడవి ప్రాంతంలో అడుగడుగునా పెట్టించాడు.

పెట్టాడు. వాగు దగ్గరకు వచ్చి కాళ్లు చేతులుకడుక్కునే సరికి నదియా చిప్పలో జావను దేవ్‌తో బాటు శ్రీనిధికి ఇచ్చింది. ఆమె ఇప్పుడు వీళ్లిచ్చే ఆహారాన్ని తినగలుగుతోంది. మొదట్లో వాళ్ల తిండినీ, వాడే పాత్రల్ని చూసి రోత పడేది. తనింట్లో తళతళలాడే పాత్రలూ, వేడివేడి భోజనం, రుచికరమైన పదార్థాలు కళ్లు ముందు తిరిగేవి. కానీ, కాలే కడుపు అరిచే అరుపులకు భయపడి వాళ్లు పెట్టేది తినేస్తుంది. అక్కడ వీరేంద్ర ఏం చేస్తుంటాడు? తను చనిపోయిందనుకుంటున్నాడా? ఇక తనను వెదకడం మానేసుంటాడు. బహుశా ఇంకొన్నాళ్లు పోతే తనని పూర్తిగా మర్చిపోతాడేమో? మళ్లీ పెళ్లి చేసుకుంటాడా?... అమ్మో! అలా అయితే తన గతి ఏమిటి? తనిక్కడ ఇలాగే పడిపోతుందా? ఆ పరిసరాలను కలియజూసింది. అక్కడక్కడ చేత్తో విసిరేసినట్లు పదిపన్నెండు గుడిసెలు వున్నాయి. అప్పుడప్పుడే పనుల నుంచి తిరిగి వచ్చి పొయ్యి రాజేస్తున్న వీళ్లతో కోళ్లను అమ్ముతున్న వాళ్లతో సందడిగా వుంది అక్కడ. ఆకలికి ఏడుస్తున్న పసిపిల్లలకు గుమ్మాల్లో కూర్చుని చనుబాలు పట్టిస్తున్న తల్లులను చూసింది. ఆమెలో ఏదో గుబులు పుట్టింది. తను జీవితాంతం ఇక్కడ ఇలాగే వుండిపోతుందా? దేవుడా నాకెందుకీ శిక్ష? ఆ రోజు భర్త మీద కోపంతో తనలా వచ్చేయడంతోనే ఇలా జరిగింది. కాస్త సహనంతో వుంటే ఈ దుస్థితి వచ్చేది కాదు కదా? తాను దిద్దుకోలేని పొరపాటు చేసింది. ఒక్కడ తను బతుకెట్లా తెల్లవారుతుందో కాలమే చెప్పాలి అనుకుంటూ వాళ్లవైపు దృష్టి మరల్చింది. కొండ పైకి ఏటవాలుగా ఎదిగి విరబూసిన మోదుగ చెట్లు నీళ్లల్లో ప్రతిబింబిస్తున్నాయి. చిన్ననాడు చందమామ కథల్లో చదివిన పగడపు దీవి ఇలాగే వుండేదేమో అనుకుంది ఆమె. ఆ దృశ్యాన్ని చూస్తున్న ఆమెకు పిల్లన గ్రోవి చెవులకు కింపుగా వినిపడింది. వాగు మీంచి తేలి వస్తున్న చల్లని గాలి ఆలోచనలతో అలసిన ఆమెను సేదతీరుస్తుంటే ఒక బండరాయిపై ఒదిగింది. కాస్త దూరంలో మట్టిపాత్రలు తోముతున్న నదియాను చూసింది. ముదిమితో ఆమె చర్మం బాగా ముడతలు పడింది. నడుం వంగిపోయింది. వొళ్లంతా శుష్కించిపోయింది. అయినా ఎప్పుడూ ఏదో పని చేస్తూనే వుంటుంది. ఆ పక్కనే దేవ్‌ని చూసింది. తన యూరప్ వెళ్లినప్పుడు మ్యూజియంలో చూసిన గ్రీకు వీరుని శిల్పంలా వుంటాడు. వాళ్లిద్దరూ తనకేమవుతారు? తనకింత సేవ చేసిన వీళ్ల ఋణం ఎలా తీర్చుకోగలదు? తానిక్కడే వాళ్లతో ఎప్పటికీ ఇలాగే వుండిపోవల్సిందేనా?

***

శ్రీనిధికి ఊపిరి సలపనట్లుగా అవుతోంది. ఆమెనెవరో ఇనుపసంకెళ్లతో బంధించినట్లుగా అనిపించింది. ఉలిక్కిపడి లేచింది. చీకట్లో ఏం తెలియడం లేదు. ఎవరో ఆమెని కదలకుండా అదిమిపట్టుకున్నారు. బలంగా తోయడానికి ప్రయత్నించింది. సాధ్యం కాలేదు. భయంతో పెద్దగా అరిచింది. ఎవరో పరుగెత్తుకు వచ్చిన శబ్దం అయింది. ఆమెను అదిమిపెట్టిన మనిషిని పైకి లాగి ఎడాపెడా బాదుతున్నారు. శ్రీనిధి కళ్లు నులుముకుంటూ చూసింది. దేవ్.... ఆ మనిషినిచచ్చేలా కొట్టాడు. దేవ్...తనని కాపాడాడు. దేవ్ వెంట వుండగా తనకే ప్రమాదమూ రాదు అనుకుంది. దేవ్ పశువులను తీసుకొని అడవిలోకి వెళితే అతని కూడా వెళుతుంది. పశువుల మేతకు వదిలి అడవిలో దొరికే పళ్లూ, కాయలూ, చింతలూ, చితుకులూ లాంటి ఏరేవాళ్లు. వలలు వేసి చేపల్ని, పక్షుల్ని పట్టుకునేవారు. ఆ కొండకోనల్లో దేవ్ వాయించే పిల్లన గ్రోవి వింటూ తనని తను మైమరిచిపోయేది. వాగుల్లో వంకల్లో దేవ్ సొరచేపలా ఈదుతుంటే ఆమె దోనెల్లో నింపుకున్న తేనె జుర్రుకుంటూ పాటలు పాడుకునేది. ఆమెకు మోదుగ పూలంటే ఇష్టం అని తెలుసుకున్న దేవ్ రోజూ ఓ పూల రెమ్మని ఇచ్చేవాడు. అందంగా పూచిన రెమ్మ కోసం అతను చిటారు కొమ్మనందుకోవడానికైనా తెగించేవాడు. కొమ్మ విరిగి అతడు పడిపోతాడేమోనని భయపడేది ఆమె. ఎండలు ముదురుతున్నాయి. మోదుగులు ఎండుతున్నాయి. పూలరేకులు రాల్తున్నాయి. నేలంతా పగడాలు ఆరబోసినట్లు వుంది. బాగా పూసిన రెమ్మ కోసం దేవ్ బాగా వెతుక్కోవలసి వచ్చేంది. తాను వారించినా వినకుండా చెట్టు పైపైకి ఎక్కుతాడు. అతనికంత తెగింపెందుకో అర్థం కాలేదు ఆమెకు. రోజులు గడిస్తున కొద్దీ తన కోసం వీరేంద్ర వస్తాడనే ఆశలు వదులుకుంది శ్రీనిధి.

***

శ్రీనిధి కోసం విసిగి వేసారి పోయాడు వీరేంద్ర. ఏ అడవి జంతువో ఆమెని తినేసి వుంటుందా? ఆ ఆలోచనకే జలదరించింది అతని ఒళ్లు. తనెంత పొరపాటు చేశాడు. బిజినెస్ గొడవలో పడి ఆమెను నిర్లక్ష్యం చేశాడు. పెళ్లిరోజు ఆమెకోరిన చిన్న కోర్కె. వజ్రాల నెక్లెస్ కంటే తనతో గడిపే కొన్ని గంటల సమయం అమూల్యమైనదనుకుంది. తను ప్రయత్నిస్తే సమయానికి రాగలిగేవాడు. నిర్లక్ష్యానికి ఆమె మనసెంత గాయపడి వుంటుంది? తనది నిజంగా పొరబాటే! దానికి చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సి వచ్చింది. ఈ శూన్యాన్ని తను భర్తీ చేసుకోగలడా? శ్రీనిధి కోసం ఇంకా గాలిస్తూనే వున్నాడు. ఆశ చావక అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాడు. తన బిజినెస్ వ్యవహారాలన్నీ పక్కన పెట్టి కొండపై గెస్ట్‌హౌస్‌లో వుంటున్నాడు. శ్రీనిధిని వెదికి అప్పగించిన వాళ్లకు భారీ బహుమతులు ప్రకటించాడు. ఆమె ఫోటోలను ఆ అడవి ప్రాంతంలో అడుగడుగునా పెట్టించాడు. కొండ ప్రాంతంలో నెలకోసారి జరిగే సంత దగ్గర కూడా చాలా చోట్ల ఫోటోలు అతికించాడు. ఆ సంతలో గిరిజనులు తాము పోగు చేసిన అటవీ సంపదను అమ్ముతారు. మారకం చేస్తారు. మోదుగపూలను ఉడికించి గుజ్జుగా తీసిన రంగుగా చేసి అమ్ముతారు. సంతలో రంగును అమ్మడానికి వచ్చిన గిరిజనుడు శ్రీనిధి ఫోటోను చూశాడు. లోతట్టు ప్రాంతపు అడవిలో మోదుగ చెట్లల్లో దేవ్‌తో పాటు ఆమెను చూసిన ఆ గిరిజనుడు సమా

చారం అందించాడు.

***

తూర్పు తెలతెలవారుతోంది. అప్పుడేనిద్ర లేచింది శ్రీనిధి. గుడిసె వైపు నలుగురైదుగురు కొత్త వ్యక్తులు వస్తున్నారు. వాళ్లలో ఆమెకు బాగా తెలిసిన రూపం వీరేంద్ర. అవును వీరేంద్రే! ఇది కలా నిజమా? కాదు..కాదు... నిజమే... స్థాణువులా నిలబడిపోయిన ఆమె దగ్గరికి అతను పరుగున వచ్చాడు.

ఆమెను హత్తుకున్నాడు. ఆ స్పర్శలో అతని హృదయాంతరాళ్లల్లో వున్న ఆర్తిని పసిగట్టింది. ఆమె చేతులూ అతన్ని పెనవేసుకున్నాయి.

వీరేంద్ర వెళ్లబోయేముందు శ్రీనిధిని రక్షించినందుకు కృతజ్ఞతగా దేవ్‌కి డబ్బులివ్వబోయాడు. మోదుగపూరంగులో తళతళలాడుతున్న వెయ్యిరూపాయల నోట్లు.. ఆ నోట్ల కట్టని కనీసం కొనగంటితోనైనా చూడలేదు దేవ్. వెళ్తొన్న శ్రీనిధిని ఆగమని సైగ చేస్తూ తూనీగలా వెళ్లి అల్లంతదూరాన వున్న మోదుగ చెట్టు ఎక్కి చిటారు కొమ్మనున్న ఒకే ఒక పూలరెమ్మ తెచ్చి ఆమెకందించాడు. వీరేంద్ర చేతిలో డబ్బు అలాగే వుండిపోయింది. పూలరెమ్మతో శ్రీనిధి వెళ్లిపోయింది.

***

శ్రీనిధి భర్తతో ఇల్లు చేరింది. ఎత్తయిన కొండ మీంచి జారి లోయలో పడడంతో దాదాపు రెండు నెలల తర్వాత చికిత్స కోసం వచ్చిన శ్రీనిధిని పరీక్షించిన డాక్టర్లువిస్తుపోయారు. అంత ఎత్తు నుంచి కిందపడిన శ్రీనిధికి చాలా చోట్ల ఎముకలు విరిగాయి. కాకపోతే ఆ అడవి మనుషులు సకాలంలో చేసిన చికిత్సతో విరిగిన ఎముకల్ని సక్రమంగానే అతుక్కున్నాయి. వాళ్లు వాడిన ఆకుపసర్లు యాంటీ టాటానస్‌గా పనిచేయడంతో ప్రాణాపాయం తప్పిందనుకున్నారు. నల్లమందు మత్తులో వుంచడంతో పెద్దగా నొప్పి తెలీలేదన్నారు. గుడ్ల సొనల్లో ఔషధగుణాలున్న పసర్లు కలిపి ఒళ్లంతాపూసి కట్టు కట్టడంతో పగుళ్లు వారిన ఎముకలన్నీ అతికాయని నిర్ధారించుకున్నారు. ఆ అడవి మనుషుల అపురూపమైన చికిత్స గురించి డాక్టర్లు చెప్పింది విన్న శ్రీనిధి కళ్ల ముందు దేవ్ రూపమే మెదిలింది. దేవ్ తాను అష్టావక్ర కాకుండా కాపాడిన దేవుడతను. మూర్ఖత్వంతో తనకు తానే కొరివి పెట్టుకోబోయిన తను వసివాడని మల్లెలా తన భర్త దగ్గరకు చేరిందంటే అది దేవ్ అమృతహస్తం చలవే! దేవ్... దేవ్ ఆమె మనసు మననం చేసుకుంటుందామె. కళ్ళ ముందు ఎన్నెన్నో దృశ్యాలు తిరుగుతున్నాయి. దేవ్ తనకు సపర్యలు చేయడం, తాము చెట్టాపట్టాలు వేసుకొని కొండ కోనల్లో తిరగడం తాను నడవలేకపోతే దేవ్ ఎత్తుకొని అతను పిల్లనగ్రోవి వూదుతుంటే తాను మైమరచి వింటూండిపోవడం, అడవిలో తనకు దాహం వేస్తే, అతను పుట్టతేనె పట్టివ్వడం, ఆకలి వేస్తే సీమ చింతలు ఒలిచి ఇవ్వడం.. వీరేంద్ర ఇచ్చిన డబ్బును తిరస్కరించి తనకు పూలరెమ్మనిచ్చి సాగనంపడం... ఎన్నెన్నో జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలు మధ్య ఆమెలో.... భావోద్వేగం కలుగుతుంది. అతనో యువకుడు. తాను అందమైన యువతి. అతను తనకు సమీపంగా, సన్నిహితంగా ఉన్నప్పుడు తనలో ఏదో సంకోచం, భయం కలిగేవి. కానీ అతని కళ్లల్లో తన పట్ల కోరికా, కాంక్షా ఏ సందర్భంలోనూ కనిపించలేదు. ఆ కళ్లు నిర్మలంగా వుండేవి. తనకు చికిత్స చేసినప్పుడు అతనిలో వైద్యుడ్ని, ఆకలి తీర్చినప్పుడు మాతృత్వపు మమకారాన్ని, గాలం వేసి చేపలు పట్టడం, పిల్లనగ్రోవి నేర్పడంలో గురువునీ, సాహచర్యంలో మంచి స్నేహితుడ్ని, అడవి మనిషి బారి నుంచి తన మానాన్ని కాపాడినప్పుడు అతనిలోని పౌరుషాన్ని చూసింది. వీరేంద్ర ఇవ్వబోయిన డబ్బును తిరస్కరించడంలో ప్రతిఫలాపేక్షలేని మానవత్వాన్ని చూడగల్గింది.

తాను ఇంటికి తిరిగివచ్చాక భర్తలో మార్పు స్పష్టంగా గమనించింది. తన నిర్లక్ష్యం కారణంగా తాను దూరమైందన్న భావంతో తననెంతో అపురూపంగా చూసుకుంటున్నాడు. తను తొందరపాటుతో చేజార్చుకోబోయిన అమృతభాండాన్ని దేవ్ కారణంగా దక్కించుకుంది. ఈ జీవితం దేవ్ భిక్షే.... కారు గమ్యం చేరడంతో ఆమె ఆలోచనాస్రవంతికి అడ్డుకట్ట వేసింది.

వీళ్ల గూడెం చేరేసరికి దేవ్‌కి అగ్ని సంస్కారం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. చైతన్యస్రవంతిలా వుండే దేవ్‌ని నిర్జీవంగా చూసి తట్టుకోలేకపోయింది శ్రీనిధి. తన ఎముకలు అతికించి అమృతహస్తాలలా చలనరహితంగా అయ్యాయేమిటి? అస్తమానం పిల్లనగ్రోవిని పలికించే పెదాలట్లా బిగుసుకున్నాయెందుకని? దీపాల్లా వెలిగే కళ్లెందుకట్లా కాంతివిహీనమయ్యాయి? కొండకోనల్లో నిరంతరంగా సంచరించే ఆ పాదాలు అలసిసొలసి విశ్రాంతి కోరుకున్నాయా? ఎందుకిలా జరిగింది? ఏం జరిగింది? స్థాణువులా నిలబడిపోయిన శ్రీనిధి దగ్గరకి గుండె పగిలేలా ఏడుస్తూ వచ్చింది నదియా. ఆమె చేయి పట్టుకొని గుడిసెలోకి తీసుకెళ్లింది. అక్కడ ఓ రాతి మీద పీలికలైన దుస్తులూ, రైడింగ్ బూట్లు తనవే. తాను లోయలోకి పడిపోయినప్పుడు తన ఒంటి మీద వున్నవే! వాటి వంక చుపుతూ నదియా తన భాషలో ఏదో చెబుతోంది ఏడుస్తూనే. శ్రీనిధికేం అర్థం కావడం లేదు. వాళ్లతో వచ్చిన డ్రైవరు విషయాన్ని తర్జుమా చేసి చెప్పాడు.

మోదుగ చెట్లు పూసినపుడల్లా దేవ్ ఆ పూలను ప్రత్యేకంగా తెచ్చి ఆ వస్తువుల దగ్గర రాశిగా పోసేవాడట. అలా పూల కోసం చెట్టు ఎక్కినప్పుడు కొమ్మ విరిగి కింద పడ్డాట. తలకు కొండరాయి తగలడంతో ప్రాణం పోయింది.

***

అంత్యక్రియలకు అంతా సిద్ధం చేశారు.

శ్రీనిధి దోసిలితో పూరెక్కల్ని అతని పాదాలపై పోసింది. గ్రీకు వీరుణ్ణి తలపించే దేవ్ అగ్నికి ఆహుతి కావడం చూడలేనట్లుగా వెనుదిరిగి వెళ్లిపోయిందామె.

చాన్దీ... చాన్దీ... దేవ్ పిల్చినట్లుగా అనిపించి వెనక్కి మరలి చూసింది. నిశ్చలంగా పడుకుని వున్నాడు. అతని చావులో తనని ఆరాధించే ప్రేమికుడ్ని చూసిందామె...దేవుడి సాక్షిగా తమ మధ్య ఏర్పడ్డ అదృశ్య బంధమేదో కడసారిగా అతన్ని చూడడానికా తనిక్కడి దాకా లాక్కొచ్చింది. ★

